
నమస్తే తెలంగాణ
# ఆదిలాబాద్ - నిర్మల్
10 నిజామాబాద్ ఆదివారం 23 ఫిబ్రవరి 2025 ADILABAD NIRMAL



**తరుముడే.. తరుముడు..**

- జాతీయ పార్టీల అభ్యర్థులపై జనాల్లో తీవ్రమైన అసంతృప్తి
- హస్తం పార్టీలో సరిపోని 'ఫోర్స్'.. లోకల్ ఫీలింగ్ తేలేకపోతున్న కమలం



# వ్యతిరేకత.. అనైక్యత

**సొంత పార్టీ నాయకుల నుంచే కొరవడిన సహకారం**

మంచిర్యాల, ఫిబ్రవరి 22(నమస్తే తెలంగాణ ప్రతినిధి) : ఆదిలాబాద్ – కరీంనగర్ – నిజామాబాద్ – మెదక్ పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు నాలుగు రోజుల సమయం మాత్రమే ఉంది. ఎత్తుకు పైఎత్తులు వేస్తూ ఎన్నికల బరిలో దిగిన అభ్యర్థులపై జనాల్లో తీవ్ర అసంతృప్తి కనిపిస్తున్నది. జాతీయ పార్టీలైన కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థుల పరిస్థితి మరీ దారుణంగా మారింది. రాష్ట్రంలో ఏడాది పాలనలో కాంగ్రెస్ చేసింది ఏం లేదు. 50 వేల ఉద్యోగాలు భర్తీ చేసినట్లు గొప్పలు చెప్పుకుంటున్నా.. వీటిలో సగానికిపైగా ఉద్యోగాలు కేసీఆర్ సర్కారు హయాంలో నోటిఫికేషన్ ఇచ్చి, పరీక్షలు నిర్వహించినవే ఉన్నాయి. గెలిచిన ఏడాదిలో రెండు లక్షల ఉద్యోగాలిస్తామని చెప్పి, జాబ్ క్యాలెండర్‌ను విడుదల చేసిన కాంగ్రెస్ సర్కారు.. ఆ హామీని నిలబెట్టుకోలేకపోవడంతో గ్రాడ్యుయేట్ నిరుద్యోగులు ఆగ్రహంతో ఉన్నారు. మిగిలిన వర్గాలైన రైతులు, మహిళలు, వృద్ధులను సంతృప్తి పరచడంలో ఘోరంగా విఫలమైంది. ఇక కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీకి ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో నలుగురు ఎమ్మెల్యేలు, ఎంపీ ఉన్నా.. జిల్లాకు ఒరగబెట్టింది ఏం లేదు. గతంలోనూ ఇక్కడ ఎంపీ బీజేపీ నుంచే ఉన్నారు. నవోదయ పాఠశాల మంజూరు, సిమెంట్ ఫ్యాక్టరీ పునరుద్ధరణ, రైల్వేలైన్ అంశంలో పురోగతి లేదు. ఇలా రెండు జాతీయ పార్టీలపై జనాల్లో తీవ్రమైన వ్యతిరేకత కనిపిస్తున్నది.

### కలిసి రాని నాయకులు..

జాతీయ పార్టీలపై ప్రజల్లో ఉన్న వ్యతిరేకతకు తోడు కాంగ్రెస్, బీజేపీల్లోని క్షేత్రస్థాయి కీలక నాయకులు ఎమ్మెల్సీ ఎన్నికల విషయంలో అంటీ ముట్టనట్లు వ్యవహరిస్తున్నారు. కాంగ్రెస్ అభ్యర్థి విషయంలో సీఎం రేవంత్ రెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌గౌడ్ ఏకపక్ష నిర్ణయం తీసుకోవడం, పైగా మంత్రులకు ఇన్‌చార్జి ఇవ్వడంతో ఆ పార్టీ ఎమ్మెల్యేలు అసహనంతో ఉన్నట్లు తెలుస్తున్నది. చాలా చోట్ల మంత్రులు ప్రచారం చేయడానికి వచ్చినప్పుడే ఎమ్మెల్యేలు కనిపిస్తున్నారు తప్ప అసలు ఎమ్మెల్సీ ఎన్నికలను వాళ్లు సీరియస్‌గా తీసుకోవడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కాంగ్రెస్ పార్టీ టికెట్ ఇచ్చిన నరేందర్‌రెడ్డికి కేవలం ఉమ్మడి కరీంనగర్, మంచిర్యాల జిల్లాల్లోనే గుర్తింపు ఉందని, ఉమ్మడి నిజామాబాద్, మెదక్ జిల్లాలతోపాటు ఆదిలాబాద్, నిర్మల్, ఆసిఫాబాద్ జిల్లాల్లో ఆయన ఫోర్స్ సరిపోవడం లేదని ఆ పార్టీ నాయకులే అంటున్నారు. మొన్నటికి మొన్న నిర్మల్ జిల్లా ముథోల్ మీటింగ్‌లో ప్రచార కార్యక్రమంలో ఖాళీ కుర్చీలు దర్శనం ఇవ్వడం ఈ వాదనకు బలం చేకూరుస్తున్నది. ఇక బీజేపీ అభ్యర్థి అంజిరెడ్డి మెదక్ జిల్లావాసి కావడంతో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో లోకల్ ఫీలింగ్ తీసుకురాలేకపోతున్నారు. నిజామాబాద్, కరీంనగర్‌లోనూ దాదాపు ఇదే పరిస్థితి ఉందనే గుసగుసలు వినిపిస్తున్నాయి. ఇక బీజేపీ నుంచి టికెట్ ఆశించి భంగపడిన ఆ పార్టీలోని సీనియర్లు ఆయనకు సహకరించడం లేదని తెలిసింది. గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీని వదిలేసి, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ కోసం సదరు నాయకులు ఎక్కువగా ప్రచారం చేస్తున్నారు. ఇక బీజేపీ నుంచి పోటీ చేస్తున్న టీచర్ ఎమ్మెల్సీ అభ్యర్థి విషయంలోనూ ఇదే పరిస్థితి కనిపిస్తున్నది. జాతీయ పార్టీల నుంచి బరిలో ఉన్న అభ్యర్థులంతా డబ్బులున్న వారు కావడం కూడా పైసలున్నోళ్లకే టికెట్లు ఇచ్చాయనే చర్చ జనంలో నడుస్తున్నది. ఇది కూడా ఆ పార్టీల అభ్యర్థులకు మైనస్‌గా మారనుంది.

### ముందున్నంత లేదు..

ఎమ్మెల్సీ ఎన్నికల షెడ్యూల్ రావడానికి ముందు ఉన్నంత వేడి ఇప్పుడు కనిపించడం లేదు. జాతీయ పార్టీ అభ్యర్థుల విషయంలో పునరాలోచన చేసి ఉంటే బాగుండేదన్నది మెజార్టీ అభిప్రాయంగా కనిపిస్తున్నది. నాలుగు ఉమ్మడి జిల్లాల్లో పోటీ చేసే అభ్యర్థులు అన్ని ప్రాంతాలను ప్రభావితం చేసేవారై ఉండాలి. ఈ ఎన్నికల కోసం ఆయా పార్టీలు ప్రకటించిన అభ్యర్థులు కొన్ని జిల్లాలకే పరిమితం అవుతున్నారు. ఒకటి, రెండు జిల్లాల్లో తప్ప మిగిలి ప్రాంతాల్లో వారి ప్రభావం తక్కువగా కనిపిస్తున్నది. దీంతో జిల్లాకు ఓ అభ్యర్థి పేరు వినిస్తున్నది. ఈ నేపథ్యంలో గెలుపు, ఓటములను అంచనా వేయడం కష్టంగా మారింది. ముఖ్యంగా ఆయా పార్టీల ఎమ్మెల్యేలు, స్థానిక లీడర్లు ఎమ్మెల్సీ ఎన్నికలకు సీరియస్‌గా తీసుకోకపోవడం అన్నది ఇబ్బందిగా మారింది. ఇప్పటికైనా జాతీయ పార్టీల నాయకులు ఆ పార్టీ అభ్యర్థుల కోసం నడుం బిగిస్తే తప్ప విజయం సాధించడం అంత సులభం కాదని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఈ విషయంలో ఆయా పార్టీలు ఎలాంటి జాగ్రత్తలు తీసుకుంటాయన్నది చర్చనీయాంశంగా మారింది.


### వాడేసుకుంటున్న ఉపాధ్యాయ లీడర్లు

ప్రస్తుతం గ్రాడ్యుయేట్స్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా ప్రైవేటు విద్యాసంస్థల ఉపాధ్యాయ సంఘాల హవా నడుస్తున్నది. ఇప్పటికే రెండు వర్గాలుగా ఉన్న ట్రస్మా నాయకులు ఎవరికి వారు తమకు కావాల్సిన వారికి మద్దతు ప్రకటించి ప్రచారంలో మునిగి తేలుతున్నారు. ఇక ప్రత్యేకంగా కాంగ్రెస్ అభ్యర్థి విషయంలో ప్రైవేటు విద్యాసంస్థల ఉపాధ్యాయ లీడర్ల పెత్తనం ఎక్కువైపోయింది. ఉత్తర తెలంగాణలో దాదాపు 50కి పైగా విద్యాసంస్థలున్న విద్యా వ్యాపారిగా ఆయన్ని జనాలు అభివర్ణిస్తున్నారు. ఇన్ని విద్యా సంస్థలు ఉండి ఏనాడు జనాల కోసం ఏం చేయని ఆయన ఇప్పుడు ఎమ్మెల్సీగా గెలిచేందుకు ప్రజాసేవ నినాదం ఎత్తుకున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఇక ఆయన వెనకే ఉంటూ వెన్నుపోటు పొడిచేందుకు ప్రైవేటు విద్యాసంస్థల ఉపాధ్యాయ సంఘాల లీడర్లు కొందరు కత్తులు నూరుతున్నట్లు తెలుస్తున్నది. ఎలాగైనా సార్‌తో డబ్బులు ఖర్చు పెట్టించి, ఆయన్ని ఓడించడమే లక్ష్యంగా ఆ కొందరు ఉపాధ్యాయ నాయకులు కంకణం కట్టుకున్నారనే ప్రచారం ఇప్పుడు ఉమ్మడి జిల్లాలో హాట్ టాపిక్‌గా మారింది. ఇక బీజేపీ టీచర్ ఎమ్మెల్సీ అభ్యర్థి విషయంలోనూ కొందరు ఉపాధ్యాయ సంఘాల నాయకులు ఈ వ్యూహాన్నే అనుసరిస్తున్నారు. ఇది కూడా ఈ అభ్యర్థులకు కష్టాలు తీసుకురానుందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

## క్రీడాకారులను ప్రోత్సహించాలి

**మాజీ మంత్రి జోగు రామన్న**

బేల, ఫిబ్రవరి 22 : క్రీడాకారులను ప్రోత్సహించడం వల్ల తమలో ఉన్న నైపుణ్యాన్ని వెలికి తీసిన వారమవుతామని, తన చిన్నతనం నుంచే క్రీడలంటే ఇష్టమని మాజీ మంత్రి జోగు రామన్న అన్నారు. పుసాంగూడలో జోగు ఫౌండేషన్ ఆధ్వర్యంలో కబడ్డీ పోటీలను నిర్వహించగా.. గెలుపొందిన వారికి శనివారం బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి జోగు రామన్న మాట్లాడుతూ.. క్రీడలతో క్రీడాకారుల మధ్య స్నేహ పూర్వక వాతావరణం నెలకుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ చైర్మన్ రౌత్ మనోహర్, మండలాధ్యక్షుడు ప్రమోద్‌రెడ్డి, సతీష్ పవార్, గంభీర్ ఠాక్రే, మధూకర్, తన్వీర్ ఖాన్, తేజ్‌రావ్ మస్కే, బాపురావ్, సజీద్ ఖాన్ పాల్గొన్నారు.



కబడ్డీలో గెలుపొందిన క్రీడాకారులకు బహుమతులు ప్రదానం చేస్తున్న మాజీ మంత్రి జోగు రామన్న

## ప్రవేశ పరీక్షకు ఏర్పాట్లు పూర్తి

**- డీసీవో లలిత కుమారి**

ఎదులాపురం, ఫిబ్రవరి 22 : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ, బీసీ, ఎస్టీ గురుకులాల్లో ఐదో తరగతిలో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీ కోసం ఈ నెల 23వ తేదీన నిర్వహించే ప్రవేశ పరీక్షకు అన్ని ఏర్పాటు చేశామని డీసీవో జిల్లా కో–ఆర్డినేటర్ లలిత కుమారి తెలిపారు. శనివారం సాంఘీక సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాలలో నంబర్లు వేయించారు. ఈ సందర్భంగా డీసీవో జిల్లా కో–ఆర్డినేటర్ మాట్లాడుతూ.. 2025–26 విద్యా సంవత్సరానికి గాను ఐదో తరగతిలో ప్రవేశానికి, అలాగే 6,7,8,9 వ తరగతుల్లో బ్యాక్‌లాగ్ సీట్ల కోసం ఆదివారం ప్రవేశ పరీక్షను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. జిల్లాలో 4,193 మంది విద్యార్థులు దరఖాస్తులు చేసుకోగా.. పది కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. పరీక్ష ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఉంటుందన్నారు. పరీక్ష రాసే విద్యార్థులు హాల్‌టికెట్‌తోపాటు ఆధార్ కార్డు తీసుకుని రావాలన్నారు. ఒకవేళ ఆధార్ కార్డులో పేర్లు తప్పుగా ఉంటే బొనిఫైడ్ జిరాక్స్ తీసుకుని వస్తే కేంద్రంలోకి అనుమతి ఉంటుందన్నారు. విద్యార్థులు పరీక్ష కేంద్రానికి వచ్చే సమయంలో ఫ్యాడ్, బ్లూ, బ్లాక్ పెన్స్, హాల్ టికెట్, ఆధార్ కార్డు తప్పనిసరిగా తీసుకునిరావాలన్నారు.



పరీక్షా కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీసీవో లలిత కుమారి

## ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణకు పటిష్ట చర్యలు

**నిర్మల్ జిల్లా వ్యాప్తంగా 46 పోలింగ్ కేంద్రాల ఏర్పాటు**

- ధాన్యం కొనుగోళ్ల కోసం ప్రత్యేక యాప్
- సకాలంలో సీఎంఆర్ ఇవ్వని ఎనిమిది మంది మిల్లర్లపై కేసు
- విలేకరుల సమావేశంలో కలెక్టర్ అభిలాష అభినవ్

నిర్మల్, ఫిబ్రవరి 22(నమస్తే తెలంగాణ) : ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించడానికి చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ అభిలాష అభినవ్ తెలిపారు. శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఎన్నికల నిర్వహణపై విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఈనెల 27న జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికలకు జిల్లాలో 46 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. జిల్లా వ్యాప్తంగా 19,107 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారని పేర్కొన్నారు. ఇందులో 17,141 మంది పట్టభద్రులు కాగా, 1,966 మంది ఉపాధ్యాయులు ఉన్నారన్నారు. ఇప్పటివరకు 149 పోస్టల్ బ్యాలెట్‌లు వచ్చాయన్నారు. ఈ నెల 26న జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ మినీ స్టేడియంలో ఎన్నికల సామగ్రిని అధికారులకు అందజేస్తామన్నారు. అలాగే ఈనెల 23 నుంచి 26 వరకు ఓటరు స్లిప్పులను పంపిణీ చేస్తామని తెలిపారు. ఓటర్లకు ఓటు వినియోగంపై అవగాహన కల్పించేందుకు ఈ నెల 24,25 తేదీల్లో స్థానిక ఆర్డీవో కార్యాలయంలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఎన్నికల నియమావళిని పకడ్బందీగా అమలు చేస్తున్నామని, ఇప్పటికే పలు కేంద్రాలను సందర్శించి ఏర్పాట్లను పరిశీలించామన్నారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో లైవ్ వెబ్ కాస్టింగ్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఇప్పటికే విధులు నిర్వహించే అధికారులకు మాస్టర్ ట్రెయినర్లతో శిక్షణ ఇప్పించామని తెలిపారు.

### ధాన్యం కొనుగోలుకు ప్రత్యేక యాప్

ధాన్యం కొనుగోళ్లను పకడ్బందీగా నిర్వహించేందుకు ప్రత్యేకంగా యాప్‌ను తయారు చేసినట్లు కలెక్టర్ వెల్లడించారు. గడువులోగా సీఎంఆర్ బియ్యాన్ని ఇవ్వని ఎనిమిది మంది రైస్ మిల్లర్లను గుర్తించి, రెవెన్యూ రికవరీ యాక్ట్ ప్రకారం కేసులు నమోదు చేశామని తెలిపారు. పరిహారం చెల్లించని మిల్లర్ల నుంచి దాదాపు 30 ఎకరాల భూమిని, ఇతర ఆస్తులపై రెవెన్యూ రికవరీ చట్టాన్ని వర్తింపజేసి సదరు ఆస్తులను బ్లాక్ చేసినట్లు పేర్కొన్నారు. అలాగే జిల్లాలో బియ్యం అక్రమ రవాణా జరగకుండా అంతర్రాష్ట్ర చెక్‌పోస్టుల వద్ద పటిష్ట భద్రతా చర్యలు ఏర్పాటు చేశామన్నారు. ఇదిలా ఉంటే జిల్లాలో ప్రత్యేకంగా అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో అమలు చేస్తున్న బాలశక్తి కార్యక్రమంలో భాగంగా ఇప్పటివరకు 20 వేల మంది విద్యార్థులకు పలు రకాల వైద్య పరీక్షలు నిర్వహించి ఆరోగ్య కార్డులను తయారు చేశామన్నారు. ఈ సమావేశంలో రెవెన్యూ అడిషనల్ కలెక్టర్ కిశోర్ కుమార్, ఆర్డీవో రత్న కల్యాణి, పౌర సంబంధాల అధికారి విష్ణువర్ధన్, డీఎస్‌వో కిరణ్‌కుమార్, డీఎం వేణుగోపాల్, ఎన్నికల విభాగం పర్యవేక్షకులు శ్రీనివాస్ రావు, ఈడీఎం నదీం పాల్గొన్నారు.



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న నిర్మల్ కలెక్టర్ అభిలాష అభినవ్

### అవగాహన కలిగి ఉండాలి

నిర్మల్ అర్బన్, ఫిబ్రవరి 22 : ఎమ్మెల్సీ ఎన్నికల విధులపై తప్పనిసరిగా అవగాహన కలిగి ఉండాలని కలెక్టర్ అభిలాష అభినవ్ తెలిపారు. శనివారం కలెక్టర్ కార్యాలయంలో ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల విధులు నిర్వహించే అధికారులకు ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొన్నారు. మాస్టర్ ట్రెయినర్లు అధికారులకు ఎన్నికల విధులపై శిక్షణ ఇచ్చారు.

## మెరుగైన సేవలు అందిస్తాం..



మాట్లాడుతున్న నిర్మల్ ఎస్పీ జానకి షర్మిల

నిర్మల్ అర్బన్, ఫిబ్రవరి 22 : ప్రజలకు మెరుగైన సేవలను అందిస్తామని ఎస్పీ జానకి షర్మిల అన్నా రు. నిర్మల్ జిల్లా కేంద్రంలోని జిల్లా సాయుధ దళ కార్యాలయంలో వార్షిక మొబిలైజేషన్ ట్రెయినింగ్ ముగింపు పరేడ్‌లో ఆమె పాల్గొని గౌరవ వందనా న్ని స్వీకరించారు. ఈ సందర్భంగా పోలీసు అధికారులు, సిబ్బంది అధునాతన టెక్నాలజీని సద్వినియోగం చేసుకోవడంతోపాటు అన్ని రకాల ఆ యుధ పరిజ్ఞానం కలిగి ఉండాలని, వృత్తి నైపుణ్యా న్ని మెరుగుపర్చేందుకు శిక్షణ ఉపయోగపడుతుందని తెలిపారు. అదనపు ఎస్పీ ఉపేందర్‌రెడ్డి, ఏఎస్పీ అవినాశ్ కుమార్, రాజేశ్ మీనా పాల్గొన్నారు.




## అత్యాచార ఘటనలో ముగ్గురి అరెస్టు

- తప్పు చేసిన వారికి శిక్షలు తప్పవు
- ఇన్‌చార్జి ఎస్పీ జానకి షర్మిల

ఆదిలాబాద్, ఫిబ్రవరి 22 (నమస్తే తెలంగాణ) : ఆదిలాబాద్‌లో మైనర్ బాలికపై అత్యాచార ఘటన కేసులో ముగ్గురు నిందితులపై కేసు నమోదు చేసి అరెస్టు చేసినట్లు ఇన్‌చార్జి ఎస్పీ జానకి షర్మిల తెలిపారు. ఈ ఘటనపై పోలీసులు సత్వరమే స్పందించి శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా నిందితులను సకాలంలో అరెస్టు చేసి న్యాయ స్థానం ముందు హాజరు పర్చి జైలుకు పంపామన్నారు. ప్రజలు సంయమనం పాటించాలని, సోషల్ మీడియాలో రెచ్చగొట్టే వదంతులు, పుకార్లను నమ్మవద్దని సూచించారు. సోషల్ మీడియాలో ప్రచారం చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. అత్యాచార కేసులు ఇంగోలే అనిల్(ఏ1), ఇంగోలే గంగాధర్(ఏ2), దుప్పత్రే సుస్మా(ఏ3)పై కేసులు నమోదు చేశామన్నారు. నిష్పక్షపాతంగా కేసు దర్యాప్తు చేస్తున్నామని, ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున ఎవరు గుమిగూడి ఉండవద్దని సభలు, సమావేశాలు పెట్టవద్దని సూచించారు. శాంతి భద్రతల సమస్యలు రాకుండా గస్తీ, పెట్రోలింగ్, పికెట్స్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

## గెలు పోటములు సహజం

**బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్**

బోథ్, ఫిబ్రవరి 22 : ఆటల పోటీల్లో గెలుపోటములు సహజం అని, అనంతరం అందరూ కలిసికట్టుగా ఉండాలని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. శనివారం పట్నాపూర్ గ్రామంలో చైతన్య యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన వాలీబాల్ పోటీలను టాస్ వేసి ప్రారంభించారు. యువకులతో కలిసి కాసేపు వాలీబాల్ ఆడారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ తుల శ్రీనివాస్, వైస్ ఎంపీపీ స్వామి, మాజీ సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ సుగుణ, తదితరులు పాల్గొన్నారు.



పోటీలు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అనిల్ జాదవ్

## సుస్థిరతకు యువత తోడ్పాటును ఇవ్వాలి



మాట్లాడుతున్న వైస్ చాన్స్‌లర్ గోవర్ధన్

బాసర, ఫిబ్రవరి 22 : యువత సమాజ సుస్థిరతకు తోడ్పాటును అందించాలని బాసర ట్రి పుల్ ఐటీ వీసీ గోవర్ధన్ సూచించారు. శనివా రం ట్రిపుల్ ఐటీలో 17వ సుస్థిర అభివృద్ధి, లక్ష్యాలపై కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ కార్యక్రమం ఐక్యరాజ్య సమితి ప్రపంచ అజెండాకు అనుగుణంగా ఉందన్నారు. ఆర్జీయూకేటీ విద్యార్థులు 17 అంశాల్లో పదింటిపై దృష్టి సారించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రాకేశ్‌రెడ్డి, ఎన్ఎస్ఎస్ విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ దవాఖానలో మందుల్లేవ్..



నిర్మల్ ప్రభుత్వ దవాఖానలో మందుల చీటీ చూపుతున్న శంభు

నిర్మల్ చైన్‌గేట్, ఫిబ్రవరి 22 : నిర్మల్ పట్టణానికి చెందిన తొడసం శంభు తన భార్య సుమి త్ర అనారోగ్యంగా ఉండడంతో శనివారం నిర్మల్ మాతా,శిశు ఆరోగ్య కేంద్రానికి తీసుకొచ్చాడు. వైద్యులు పరీక్షించి మందులు రాశారు. వైద్యులు రాసిచ్చిన మందులు ఫార్మసిలో లేకపోవడంతో ప్రైవేటుగా కొనుగోలు చేయాలని సిబ్బంది సూచించారు. ఈ మేరకు ఆయన ప్రైవేటుగా తీసుకోవడంతో రూ.300 అయ్యాయని తెలిపాడు. ఈ సందర్భంగా శం భు మాట్లాడుతూ.. ప్రభుత్వ మందుల దుకాణంలో వైద్యులు రాసిచ్చిన మందులు లేకపోవడంతో బాధాకరమన్నారు. మా వంటి పేద లు బయట ప్రైవేటుగా కొనుగోలు చేయాలం టే వందల రూపాయలు అవుతాయి. తప్పని సరి పరిస్థితుల్లో కొనుగోలు చేయాల్సి వచ్చిందని తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వం మం దులను అందుబాటులో ఉంచాలని కోరాడు.